క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సంబంధిత అధికారులతో రిటర్నింగ్ అధికారి మాట్లాడారు. పరిసరాలను, అక్కడే ఏర్పాటు చేసిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీ నిర్వహించనున్న ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరిశీలనలో ఇంజనీరింగ్ విభాగం నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, డీఈఈ గిరిరాజు, ఎఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వరూప్ సిన్హాకు జాతీయ పురస్కారం

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన రాజస్థాన్ కోట, కర్నూలు శాఖ మోషన్ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సాహితీ వేత్త డాక్టర్ స్వరూప్ సిన్హా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ ఆల్ ది బెస్ట్ అకాడమీ సంస్థ, ఉగాది పురస్కారం సంస్థ 19వ వార్షికోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో పలు రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు జాతీయ స్థాయి పురస్కారాలు అందజేశారు. విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న స్వరూప్ సిన్హాకు పురస్కారం ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ, కొరియోగ్రాఫర్ సూర్య తేజ సుబ్రంత్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

మే డేను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు సోమవారం ఓ ప్రకటనలో కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే రోజున వాడవాడలా సీఐటీయూ జెండాలను రెపరెపలాడించాలని, కార్మికులహక్కుల కోసం చేయాల్సిన పోరాటాలపై ప్రతిజ్ఞ చేయాలని వారు కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఉస్మానియా విద్యార్థుల ఎంపిక

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2 వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో ఉన్న మహాత్మగాంధీ యూనివర్సిటీలో సౌత్‌జోన్ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు ఉస్మానియా కళాశాల విద్యార్థులు సంపత్ కుమార్, సుబ్బారావు ఎంపికయ్యారు. వీరిని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్ అభినందించారు. ప్రతిభ చాటి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మండలం జి.శింగవరం గ్రామానికి చెందిన రేపల్లె అశోక్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పంచలింగాల గ్రామానికి చెందిన శైలజతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే వీరు తల్లిదండ్రులతో కలసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం రాత్రి తల్లిదండ్రులు మిద్దెపై పడుకోగా అశోక్ భార్యతో కలసి వరండాలో పడుకున్నారు. అందరూ నిద్రించిన తర్వాత గదిలోకి వెళ్లి తాడుతో ఉరేసుకున్నాడు. కొద్దిసేపు తర్వాత కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. కడుపునొప్పి బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రతి గడపకూ లబ్ధి

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ పాలన
- బాబువి మోసపూరిత హామీలు
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు, ఉలిందకొండ గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు వారికి ఘన స్వాగతం పలికి భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం వారు ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకువచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు శూన్యమన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి 600పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. మాయమాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2014లో మోసం చేసినందుకు 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడి మాట ఇస్తే తప్పరన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ప్రజలు గత టీడీపీ పాలనకు ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ అందించిన పాలనలో గల తేడాను గమనించాలన్నారు. మరోసారి మోసం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి వస్తున్నాయని, ఈసారి ఆ కూటమిని చిత్తుగా ఓడించాలన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందారెడ్డిని ఎంపీగా గెలిపించాలని కాటసాని కోరారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలిస్తే రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తామన్నారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, కల్లూరు మండల వైస్ ఎంపీపీ ఆల చంద్రకళ, సర్పంచ్ సుంకులమ్మ, నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, ఆల వెంకటరమణ, పెద్ద ఈశ్వరయ్య, కేశవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, కేవీ రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుంకన్న, ఎస్సీ విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్.శివ, రాజు, నగేష్, శీనయ్య, శ్రీనివాసులు, హనుమంతురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన ఉయ్యాలవాడ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మైసూరా రెడ్డి, బోయ పుల్లయ్య, శివలింగం, నాగేంద్ర, రాజు, దస్తగిరి, శ్రీనివాసులు, రమణ, వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, ఎల్లస్వామి, సూరి, శేఖర్, గంగన్న, గంగుల ఆదినారాయణ, గంగుల బత్తిన శ్రీనివాసులు, ఎల్ల శేషయ్య, మాలిక్ బాష, శేఖర్, వెంకట రమణ, దస్తగిరి ఉన్నారు. వీరిందరికి కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పేదల బతుకులు మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు తీసుకువచ్చి ప్రతి గడపకు అందించారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి మీకు మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండని అడుగుతున్న దమ్మున నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.రామిరెడ్డి, పల్లె ప్రతాప్‌రెడ్డి, ఎస్. మదన్‌గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, బోయ గోకారి, సుబ్బారాయుడు, శివలింగం, పుల్లయ్య, రంగనాథమ్, బి. శ్రీనివాసులు, ఇమామ్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 6వ వార్డు ప్రజలు



జనరంజక పాలనకే ఓటేద్దాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- పలువురు పార్టీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన 47వ వార్డువాసులు

కర్నూలు (టౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనకే మళ్లీ ఓటేద్దామని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు రాష్ట్రంలో మంచి పాలన సాగిందన్నారు. పేదలు, మహిళల ఆర్థిక అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎంతో చేయూత ఇచ్చిందన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఉన్నత చదువుల పేరుతో విదేశీ విద్యను సైతం ఉచితంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇలాంటి మంచి పాలనను మరోసారి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లా అధ్యక్షురాల సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 2014 సంవత్సరం మేనిఫెస్టోలో ప్రకటించిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. అటువంటి తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే అన్ని విధాలా నష్టపోతామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దూరు సుభాష్ చంద్రబోస్, ఆదిమోహన్‌రెడ్డి, రైల్వే ప్రసాద్, మహిళా నాయకులు సుచరిత తదితరులు పాల్గొన్నారు.

భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక

- నగరంలోని పాతబస్తీకి చెందిన 6వ వార్డు ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో ఆ వార్డుకు చెందిన రసూల్, రహీమ్, సయ్యద్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు చేరాయి. వారికి కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెర్నెకల్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.
- నగరంలోని 11వ వార్డుకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ డ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాబు బాయ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన ఆరిఫ్, షబ్బీర్, ఉమర్, ఫరూక్, ఇర్ఫాన్ తదితరులను వారు పార్టీ కండువాలు కప్పారు.
- నగరంలోని 47వ వార్డు ధర్మపేటకు చెందిన 500 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. స్థానిక డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, ఎస్సీ సెల్ నాయకులు రైల్వే ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు. మరోసారి వైఎస్ జగనన్నను గెలిపించుకుందామని ఈ సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ పిలుపునిచ్చారు.

కోడుమూరులో హ్యాట్రిక్ ఖాయం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్ష



స్టాంటన్‌పురంలో దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న సతీష్, కోట్ల హర్ష

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలు అర్బన్ మండలం పరిధిలోని స్టాంటన్‌పురంలో ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో పేదలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికే సంక్షేమ పథకాలు వచ్చేవని, ఆ పార్టీ నాయకులే లబ్ధి పొందేవారని తెలిపారు. పేదలు, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. జగనన్న నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతం కావడం, మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్రకు జనాలు నిరాజనం పలకడంతో టీడీపీ నేతలకు భయం పట్టుకుందన్నారు. దీంతో వారు పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితంలో హామీలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. జగనన్న ఇస్తున్న పథకాలతో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు నాయుడు.. ఇప్పుడు ఆయన ఇచ్చిన హామీలతో రాష్ట్రం ఏం అవుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండాలి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుడి ఇంటికే చేర్చిన ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని సతీష్, కోట్ల హర్ష కోరారు. పొరపాటున టీడీపీ వస్తే జన్మభూమి కమిటీలతో మళ్లీ కష్టాలు తప్పవన్నారు. అర్బన్ పరిధిలోని వార్డుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీఐసీ డైరెక్టర్ పాటిల్ హనుమంతురెడ్డి, కార్పొరేటర్లు విక్రంసింహారెడ్డి, సాంబ శివరావు, హనుమంతురెడ్డి, సురేష్, ప్రభుదాస్, ప్రసాద్ గౌడ్, రాజు గౌడ్, రమణ, గిరి ప్రసాద్, వీరభద్రరెడ్డి, దామోదర్ నాయుడు, ఇషాక్, మౌలాలి పాల్గొన్నారు.

కర్నూలు అసెంబ్లీ బరిలో 25 మంది

కర్నూలు (టౌన్): కర్నూలు అసెంబ్లీ ఎన్నికల బరిలో 25 మంది నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. చివరిలో షేక్ ఇంతియాజ్ (గడ్డవీధి), అల్లుగుండు సమీనా ఇంతియాజ్ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం, కాంగ్రెస్, బహుజన సమాజ్ పార్టీ, అల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, జాతీయ సమసమాజ పార్టీ, సుపర్ రెంజర్స్ పార్టీ, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) అభ్యర్థులతో పాటు మరో 15 మంది ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు.

పాణ్యం అసెంబ్లీ స్థానానికి 14మంది

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ బరిలో 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఆ నియోజకవర్గం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన గౌరు వెంకటరెడ్డి సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 14 మంది మిగిలారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సీలింగ్ ఫ్యాన్, టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డికి సైకిల్, సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్‌కు సుత్తి, సికిల్ స్టార్, బీఎస్పీ అభ్యర్థి దాసరి రామ శేషయ్యకు ఏనుగు గుర్తులు ఉంటాయన్నారు. ఇక మిగిలిన 10 మందికి వివిధ గుర్తులు కేటాయించినట్లు చెప్పారు. సమావేశంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

కోడుమూరు బరిలో 14 మంది

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు అసెంబ్లీ బరిలో మొత్తం 14 మంది నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్లను వేయగా...అందులో ఐదుగురి నామినేషన్లను వివరాలు సరిగ్గా లేకపోవడంతో ఆర్ఓ ఎం. శేషిరెడ్డి తిరస్కరించారు. ఆమోదం పొందిన 16 మందిలో ఇద్దరు ఉపసంహరించుకోవడంతో చివరకు బరిలో 14 మంది నిలిచినట్లు వెల్లడించారు. సోమవారం ఆర్ఓ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. '14 మందిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదిమూలపు సతీష్, టీడీపీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి, కాంగ్రెస్ నుంచి పి.మురళీకృష్ణ, బీఎస్పీ నుంచి జైరాజ్ బరిలో ఉన్నారు. మిగిలిన 11 మంది చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉండడంతో వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తులు కేటాయించి'నట్లు వెల్లడించారు.

అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలి

కర్నూలు (టౌన్) : కర్నూలు అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులందరూ తప్పని సరిగా ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో కర్నూలు అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసిందని, మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. వ్యయ నమోదు రిజిస్టర్ నిర్వహణ, ఈవీఎం ర్యాండమైజేషన్, ఈవీఎంల కమిషనింగ్, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

నేటి సమాచారం

పెద్దాసుపత్రిలో పలు వైద్య పరికరాల అప్పగింత


కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల పలు వైద్యపరికరాలను కొనుగోలు చేశారు. ఆసుపత్రి హెచ్‌డీఎస్ నిధులతో సమకూరిన వీటిని మంగళవారం (30వ తేది) జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆయా విభాగాలకు అందజేస్తారు. ఇందులో ఎండోక్రైనాలజి విభాగానికి డెస్కా స్కాన్ మిషన్, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి గ్యాస్ట్రో స్కోపి, కొలనొస్కోపి, ఈఆర్‌సీపీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, నెఫ్రాలజి విభాగానికి కేటాయించిన అల్ట్రాసౌండ్ మిషన్లను అందజేస్తారు. అనంతరం ఆధునీకరించిన ఏఎంసీ విభాగాన్ని కలెక్టర్ పరిశీలిస్తారు. ఈ వైద్యపరికరాల కొనుగోలు, ఏఎంసీ ఆధునీకరణకు దాదాపు రూ.ఒక కోటికి పైగా ఖర్చు చేశారు.

సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును మంగళవారం బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా 30వ తేదీ సెలవు ప్రకటించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్‌లకు సంబంధించి మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా మంగళవారం కర్నూలు నగరంలో రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు ఈ సమస్య ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని సోమవారం వారు ఒక ప్రకటనలో కోరారు.



టీజీవీ పరిశ్రమల్లో సెబ్ తనిఖీలు



టీజీవీ పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్

కర్నూలు : గొందిపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బీజేపీ నేత టీజీవీ గ్రూప్స్‌కు చెందిన రెండు పరిశ్రమల్లో (మిథైల్ యుటిలైజింగ్ యూనిట్స్) సోమవారం సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. క్లోరోమిథైల్ తయారీ కోసం ఏడాదికి 66,258 బల్క్ లీటర్ల మిథైల్‌ను వాడాల్సి ఉంది. అంతకంటే ఎక్కువ ఏమైనా వినియోగిస్తున్నారా, ట్యాంకులు ఎలా ఉన్నాయి, ఏవైనా లోపాలు ఉన్నాయా తదితర విషయాలను తెలుసుకునేందుకు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ విస్తృతంగా తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. టీజీవీ, ఎస్ఆర్ఏసీ లిమిటెడ్, శ్రీ రాయలసీమ హై స్ట్రెంత్ హైపో లిమిటెడ్ కంపెనీలో మిథైల్ వాడకం ఎలా ఉంది తదితర విషయాలను అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలో ఉన్న ట్యాంకుల పరిశుభ్రతను కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు. కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ రాజేంద్రప్రసాద్ కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు : ఆర్టీసీ బస్సులో తెలంగాణ మద్యం పట్టుబడింది. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రవికుమార్, కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ రాజేంద్రప్రసాద్ పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఆపి సిబ్బంది చేత తనిఖీ చేయించగా అందులో 96 బాటిళ్ల మద్యం దొరికింది. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన యోగేంద్రగౌడును అదుపులోకి తీసుకుని విచారించగా విక్రయ నిమిత్తం పెబ్బేరు నుంచి ముచ్చుమర్రికి తీసుకువెళ్తున్నట్లు తెలిపాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే కల్లూరు మండలం కొల్లంపల్లి తండాలోని నాటుసారా స్థావరాలపై దాడులు జరిపి 3,400 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. జమున అనే మహిళ వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పుల్లారెడ్డిలో ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు (సిటీ): జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం పుల్లారెడ్డి ఛారిటీస్ ట్రస్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వల్లూరు వెంకటరంగారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు జి.పుల్లారెడ్డి చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ జి.రాఘవరెడ్డి ప్రసంగిస్తూ జి. పుల్లారెడ్డి విద్యాసంస్థలను నెలకొల్పి ఎంతోమందిని గొప్పగొప్ప ఇంజనీర్లను సమాజానికి అందించారన్నారు. ట్రస్టు ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులు సమాజానికి తమ వంతుగా సేవలు అందించాలన్నారు. ట్రస్టు ద్వారా 1977 నుంచి ఇప్పటివరకు 2,457 మంది విద్యార్థులకు రూ.5,42,35,500 ఉపకార వేతనాలుగా అందించామన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి కాలేజీ చైర్మన్ పి.సుబ్బారెడ్డి, చారిటీస్ ట్రస్టీ జి.ఏకాంబర్ రెడ్డి, కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.